సమస్యల పరిష్కారానికి కృషి


మేయర్‌కు వినతి పత్రం ఇస్తున్న కాలనీ ప్రజలు

నిజాంపేట్: ప్రజ సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని మేయర్ కొలను నీలా గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం 19 డివిజన్ కార్పొరేటర్ కాసాని సుధాకర్, 20వ డివిజన్ కార్పొరేటర్ బాలాజీ నాయక్, చంద్రగిరి సతీష్‌ల ఆధ్వర్యంలో కాసాని కృష్ణ ఎంక్లేవ్ రెసిడెన్షియల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు మేయర్‌ను కలిసి తమ కాలనీల్లో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం బాచుపల్లి నుంచి గండిమైసమ్మ రోడ్డు విస్తరణ పనులను మేయర్ నీలా రెడ్డి, అధికారులతో కలసి పరిశీలించారు.

పారిశుద్ధ్య సిబ్బందికి కిట్స్ పంపిణీ...

మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేసే పారిశుద్ధ్య సిబ్బందికి భద్రత పరమైన కిట్స్ పంపిణీ చేశారు. వర్షకాలం కావడంతో రెయిన్ కోట్స్, బూట్లు, సబ్బులు,యూనిఫామ్స్, కొబ్బరి నూనె, టార్చ్‌లైట్స్, టవల్స్ లాంటి సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ రామక్రిష్ణారావు, కార్పొరేటర్లు ఆగం పాండు ముధిరాజ్, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, కాసాని సుధాకర్ ముధిరాజ్, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మీ కుమారి, నాయకులు చంద్రగిరి సతీష్, సురేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా సర్వేపల్లి పార్కు


సర్వేపల్లి రాధాక్రిష్ణ పార్కులో మద్యం బాటిళ్లు

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని సర్వేపల్లి రాధాక్రిష్ణ పార్కు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. రాత్రి సమయాల్లో పోకిరీలు పార్కుల్లో మద్యం సేవిస్తున్నారు. పార్కులో లైట్లు లేకపోవడంతో రాత్రి 10 గంటల తర్వాత అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండటంతో ప్రజలలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కోసారి అర్ధరాత్రి వరకు సైతం మద్యం సేవిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. మరి కొందరు బర్త్‌డే పార్టీలకు పార్కును వేదికగా మార్చుకుంటున్నారు. పోలీసులు ప్రగతినగర్‌లోని పార్కులపై నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. అవసరమైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అసాంఘిక కార్యాక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.


మొక్కను నాటుతున్న బీజేపీ నాయకులు

14 రోజుల పాటు సేవా కార్యక్రమాలు

జగద్గిరిగుట్ట: జన్ సంఘ్ పార్టీ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని జూన్ 23 నుంచి జూలై 6 (జయంతి) వరకు బీజేపీ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్ట కొండపై ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బీజేపీ నాయకులు చెట్లను నాటారు. నియోజకవర్గంలో 14 రోజుల పాటు ప్రతీరోజు పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ కన్వీనర్ జేకే శేకర్ యాదవ్, కార్పొరేటర్ శేషగిరి రావు, నాయకులు పాల్గొన్నారు.

భారతి అల్ట్రాఫాస్ట్ మెరుగైన సిమెంట్



భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌ను ఆవిష్కరిస్తున్న శివకుమార్, అయ్యప్పరెడ్డి

కుత్బుల్లాపూర్: మార్కెట్‌లో లభించే సిమెంట్ బ్రాండ్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ ఎంతో మెరుగైనదని భారతి సిమెంట్స్ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్‌లోని తిరుమల ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీలతో భారతి సిమెంట్స్ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్, అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ అయ్యప్పరెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో తెలంగాణ వ్యాప్తంగా విడుదల చేసిన 5స్టార్ సిమెంట్‌కు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఇతర సిమెంట్లతో పోలిస్తే నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని తెలిపారు. అల్ట్రాఫాస్ట్ ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయంతో పాటు స్లాబ్ కాంక్రీట్ వేసే సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ నవీన్, 20 మంది తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

ఇట్లయితే వర్షపునీరు ఒడిసి పట్టినట్టే.?

- మరమ్మతులకు నోచుకోని ఇంకుడు గుంతలు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



బోర్డు మిగిలి మట్టితో నిండిపోయిన ఇంకుడుగుంత..

జీడిమెట్ల: జలం లేనిదే జీవనం లేదని మనం ఒక్కో నీటి చుక్కని ఒడిసి పడితే అవసరాలకు నీటిని వాడుకోవచ్చు. కాని వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా ఒడిసి పట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం ఇంకుడు గుంతలను పట్టించుకోవడం లేదు. 2017–18 సంవత్సరంలో పైలట్ ప్రాతిపదికన జీడిమెట్ల పారిశ్రామికవాడలో ఐలా, టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో పారిశ్రామికవాడలో చాలా చోట్ల ఇంకుడు గుంతలను నిర్మించారు. అప్పట్లో టీఆర్ఎస్ ప్రభుత్వం ఇంకుడు గుంతలపై అవగాహన తీసుకురావడంతో అధికారులు లక్షల రూపాయలు వెచ్చించి గుంతలను తవ్వించి నిర్మాణాలు చేపట్టారు. కాని ఇప్పుడు వాటి మరమ్మతులను మరిచారు.

ఉన్నతాధికారులు చెబితేనే...

టీఎస్ఐఐసీ, ఐలా అధికారులు, సిబ్బంది వారి పైఅధికారులు చెప్తేనే ఏదైనా చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో నిర్మించిన ఇంకుడు గుంతలకు మరమ్మతులు నిర్వహించాలని అక్కడ ఉన్న బోర్డులపై ఏర్పాటు చేసినపుడే రాశారు. అయినప్పటికి అధికారులు మాత్రం మరమ్మతులను పెడచెవిన పెట్టి మమ్మల్ని అడిగే వారు ఎవరు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు మొద్దునిద్రలో ఉంటే ఎలా అని ప్రజలే రివర్స్‌లో అధికారులను ప్రశ్నిస్తున్నారు.

వర్షాకాలం ముందు మరమ్మతులు లేని వైనం..

ప్రతి సంవత్సరం వర్షాకాలానికి ముందు ఇంకుడు గుంతల్లో పూడిక తీసి మట్టిని తొలగించి కొంతమేర ఇసుక కంకర నింపి మరమ్మతులు నిర్వహించాలి కాని అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో గుంతల్లో మట్టి నిండి కొన్ని చోట్ల ఇంకుడు గుంతల బోర్డులు మాత్రమే మిగలగా మరికొన్ని చోట్ల అనవాళ్లు లేకుండా పోయినాయి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని ఇంకుడు గుంతలకు మరమ్మతులు నిర్వహిస్తే భూమిలో నీటి మట్టాన్ని పెంచుకోవచ్చని ప్రజలు అంటున్నారు.


చెత్తతో నిండిపోయి ఉన్న గుంత..


ఇంకుడు గుంతలో మొలిచిన చెట్టు..

ఏ నిమిషానికి ఏమి జరుగునో..?


సాయినగర్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

నిజాంపేట్: బాచుపల్లి సాయినగర్‌లో కాలనీలో పలు విద్యుత్ స్తంభాలు ప్రమాద కరంగా మారడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈదురు గాలులకు స్తంభాలు విరిగి పడే ప్రమాదం ఉందని విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. మరి కొన్ని స్తంభాలకు సపోర్టు వైర్లు లేవని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను గుర్తించి వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థినిపై ప్రిన్సిపాల్ దురుసు ప్రవర్తన

ఏబీవీపీ నాయకుల నిరసన

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఫార్మసీ కళాశాలలో ఓ విద్యార్థిని ప్రిన్సిపాల్ దురుసుగా ప్రవర్తించారని ఏబీవీపీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలలో ఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థినిని ప్రిన్సిపాల్ టార్గెట్ చేసి మూడేళ్లుగా వేధిస్తున్నట్లు విద్యార్థిని తల్లిదండ్రులతో పాటు విద్యార్థి సంఘాలకు ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న ఏవీవీపీ నాయకులు గురువారం కళాశాలకు చేరుకుని ఆందోళన చేశారు.

నాలా విస్తరణ పనులు షురూ..



గణేష్‌నగర్ నాలా వద్ద ప్రారంభమైన పనులు

జగద్గిరిగుట్ట: చింతల్, గణేష్‌నగర్ నాలా వద్ద పనులు సుమారు రూ.1.8కోట్లతో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పనులు 3 నెలల్లో పూర్తి కానున్నాయి. ఇక్కడ నాలా విస్తరణతో పాటు రీటెయినింగ్ వాల్ నిర్మించనున్నారు. ఈ విషయమై ఇంజినీరింగ్ అధికారి మల్లారెడ్డిని వివరణ కోరగా ఆలస్యంగా ప్రారంభమైన పనులు వాస్తవమేనని అన్నారు. వాటర్ వర్క్స్ పైప్‌లైన్ పనులు ఉండటం వలన ఈ జాప్యం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే వాహనాదారులు, స్థానికులకు ఎటువంటి ఆటంకం కలగకుండా తగు చర్యలు చేపట్టి వీలైనంత తొందరగా పనులు పూర్తి చేయడానికి ప్రయత్నిస్తానని మల్లారెడ్డి అన్నారు.

విద్యుత్ స్తంభాలు.. ప్రమాద ఘంటికలు


షాపూర్‌నగర్-గాజులరామారం రోడ్డులోని మూలమలుపు వద్ద అడ్డంకిగా విద్యుత్ స్తంభం

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్లపైకి ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. షాపూర్‌నగర్ నుంచి గాజులరామారం వెళ్లే మార్గంలోని షాపూర్‌నగర్ యూపీహెచ్‌సీ సమీపంలోని మూలమలుపు వద్ద విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. రోడ్డు విస్తరణలో భాగంగా సదరు స్తంభాన్ని విద్యుత్‌శాఖ అధికారులు పక్కకు జరపకుండా అలాగే వదిలేశారు. దీంతో వేగంగా వెళ్లే వాహనదారులు మూలమలుపు వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో రాత్రి వేళల్లో అయితే పలువురు ఈ మూలమలుపు వద్ద విద్యుత్ స్తంభం అడ్డుగా ఉండటంతో సడెన్‌బ్రేక్‌లు వేసి గాయపడిన ఘటనలో చాలా ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు మూలమలుపులో ఉన్న స్తంభాన్ని కాస్త పక్కకు జరపాలని వాహనదారులు కోరుతున్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్..

కుత్బుల్లాపూర్: నిర్మాణంలో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గురువారం కొంపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 3.97 కోట్లతో చేపట్టిన బాచుపల్లి ఫ్లై ఓవర్ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. బాచుపల్లి నుంచి మల్లంపేట వరకు రూ. 1.64 కోట్లతో చేపట్టిన 1.2 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను, మల్లంపేట్ నుంచి బౌరంపేట వరకు రూ. 2.07 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు, గండి మైసమ్మ నుంచి బహదూర్ పల్లి వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనుల్లో ట్రాన్స్‌ఫార్మర్ల షిఫ్టింగ్, కరెంటు పోల్ షిఫ్టింగ్ వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మియాపూర్ నుంచి గండి మైసమ్మ వరకు, కొంపల్లి నుంచి బహదూర్ పల్లి వరకు చేపట్టనున్న రోడ్డు వేస్తున్న పనుల్లో అటవీ శాఖ భూములకు అనుమతి తీసుకోని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నిజాంపేట, దుండిగల్, కొంపల్లి కమిషనర్లు రామకృష్ణారావు, సత్యనారాయణ, శ్రీహరి, తహశీల్దార్ మతిన్, హెచ్ఎండిఏ అధికారులు యూసుఫ్ హుస్సేన్, అప్పారావు, హరికృష్ణ, వేణుగోపాల రావు, రమేష్ బాబు లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారు మైసమ్మ బోనాలు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ సారెగూడెంలోని బంగారు మైసమ్మ తల్లి ఆలయ 5వ వార్షికోత్సవ బోనాల పండుగ గురువారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వివేకానంద్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఆరోగ్యాలతో ఉండేలా చూడాలని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, సాయి యాదవ్,బౌరంపేట్ పాక్స్ చైర్మన్ మిద్దుల బాల్ రెడ్డి, నాయకులు శ్రీశైలం, వీరాస్వామి, నాగార్జున, రామ్ బాబు,పాక్స్ డైరెక్టర్లు వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు మచ్చేందర్, అధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణతో జీవితం ముగిసిపోదు..

కుత్బుల్లాపూర్: ఉద్యోగ విరమణతో జీవితం ముగిసిపోదని, భావి జీవితాన్ని సామాజిక కార్యక్రమాలకు కేటాయించాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేష్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ హరి రవీంద్రనాథ్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే విచ్చేసి ఆయన్ని సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రవీంద్రనాథ్ బహదూర్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో 10 సంవత్సరాలు పాటు విద్యాబోధన చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర ఉత్తమ ప్రధాన ఉపాధ్యాయ పురస్కారం పొందారన్నారు. పదవి విరమణ అనేది వయసుకు మాత్రమేనని బాలికల విద్యా అభ్యున్నతి కోసం కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు, కౌన్సిలర్లు మైసికారి సునీత వెంకటేష్, సత్యనారాయణ, నిజాంపేట్ కార్పొరేటర్ మేకల వెంకటేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సగ్గిడి శ్రీనివాస్, శ్యామ్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలోని వాటర్‌వర్క్స్ కార్యాలయంలో

సీజీఎం శ్రీధర్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్ని ఆయనను శాలువతో సత్కరించి అభినందించారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో తాగు నీటి సమస్య పరిష్కారానికి శ్రీధర్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన శేష జీవితాన్ని సుఖ సంతోషాలతో గడపాలని అభిలాషించారు. డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్-2 స్వామి, సీజీఎంలు విజయరావు, వినోద్ భార్గవ, కిరణ్ కుమార్, నాగేంద్ర కుమార్, జియం సుబ్బారాయుడు, రిటైర్డ్ సీజీఎం సీతారాం, రిటైర్డ్ జీఎం వేణుగోపాల్, కుత్బుల్లాపూర్ జలమండలి డీజీఎంలు మేనేజర్లు, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య తదితరులు ఉన్నారు.


వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే వివేకానంద్..


జలమండలి సీజీఎం శ్రీధర్‌రెడ్డి దంపతులను శాలువతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

నేటి నుంచి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు

కుత్బుల్లాపూర్: చింతల్ ద్వారకపురికాలనీలోని విరూపాక్ష శివపంచాయతన, పోచమ్మ, సూర్యమాంబా సమేత కంఠమేశ్వర ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని ఈనెల 28 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. 28వ తేది ఉదయం 8 గంటలకు గణపతిపూజ, పుణ్యహావాచనం, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, గణపతి హోమం, 29వ తేదీన ఉదయం మండప పూజలు, చండీపారాయణం, విశేష చండీహోమం, సాయంత్రం పల్లకీ సేవ, ఊరేగింపు, 30వ తేదీ ఉదయం పూర్ణాహుతి, విద్యారణ్య భారతీస్వామీతో విశేష అభిషేకం, సంప్రోక్షణ, శాంతి కల్యాణం, మధ్యాహ్నం అన్నవితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవారి కృపకు పాత్రులుకాగలరని ఆలయ కమిటీ కోరింది.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు


మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో బీఆర్ఎస్ నాయకులు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు రాయి విఘ్నేష్ గురువారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసారు. విఘ్నేష్‌తో పాటు కలిసిన వారిలో సీనియర్ నాయకులు రాజు యాదవ్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు


ఆధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆగం పాండు

నిజాంపేట్: బాచుపల్లి కౌసాల్య కాలనీలో ఆధార్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. గురువారం కార్పొరేటర్ ఆగం రాజు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధార్‌లో ఏలాంటి మార్పులు, చేర్పులు అయిన ఇక్కడ చేసుకోవచ్చునని సూచించారు. కాలనీలోని చిల్డ్రన్స్ పార్కులో సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఓబీసీ గీత సెల్ కన్వీనర్‌గా డా.వెంకటేష్‌గౌడ్


నియామక పత్రాన్ని అందుకుంటున్న బీజేపీ ఓబీసీ గీత సెల్ రాష్ట్ర కన్వీనర్ డా. పటేల్ వెంకటేష్‌గౌడ్

సుభాష్‌నగర్: తెలంగాణ బీజేపీ ఓబీసీ గీత సెల్ కన్వీనర్‌గా డాక్టర్ పటేల్ వెంకటేష్‌గౌడ్ నియమితులయ్యారు. గురువారం ఓబీసీ రాష్ట్ర ప్రెసిడెంట్ గంధమల్ల ఆనంద్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటేష్‌గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. అదే విధంగా కో.కన్వీనర్లుగా రాగుల కిరణ్‌కుమార్‌గౌడ్, బూర్ర మన్సూర్‌గౌడ్, మీరకంటి మీరయ్యగౌడ్, తిరుమల కృష్ణగౌడ్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రెసిడెంట్ సంజయ్, జనరల్ సెక్రటరీ దివాకర్, మాజీ కన్వీనర్ పంజాల శ్రవణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం


నియామక పత్రాన్ని అందుకుంటున్న కోడి ఆదిత్య

చింతల్: కుత్బుల్లాపూర్ ఓబీసీ మోర్చా అసెంబ్లీ కో.కన్వీనర్‌గా చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన కోడి ఆదిత్య నియమితులయ్యారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జేవీఎస్ మంగేష్‌కుమార్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన బాధ్యతను అంకితభావంతో నిర్వహిస్తానని అన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

వీధి కుక్కలను తరలించండి

చింతల్: వైష్ణవి ఎన్‌క్లేవ్... ఈ గేటెడ్ కంపెనీకి వెళ్లాలంటే చక్కటి విశాలమైన రోడ్లు... రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు... కానీ ఆ కాలనీకి వెళ్లాలంటే గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్ వెళ్లే దారిలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వైష్ణవి ఎన్‌కేలవ్ కాలనీ గేటు ఎదురుగా, వెనుకవైపు గల ప్రాంతంలో పదుల సంఖ్యలో వీధి కుక్కలు తిష్ట వేసి కూర్చుంటున్నాయి. అధికారులు చొరవ తీసుకొని వైష్ణవి ఎన్‌క్లేవ్ వెళ్లే దారిలో తిష్ట వేసిన వీధి కుక్కలను తరలించాలని స్థానికులు, వాహనదారులు పేర్కొంటున్నారు.


వైష్ణవి ఎన్‌క్లేవ్ రోడ్డులో గుంపులుగా ఉన్న వీధి కుక్కలు